

స్త్రీ శక్తికి ఆదరణ

ఆర్టీసీ ఉచిత సర్వీసుల్లో పెరుగుతున్న మహిళా ప్రయాణికుల సంఖ్య

- గతంలో మొత్తం ప్రయాణికుల్లో 30-35 శాతం మంది మహిళలు
- పథకం అమల్లోకి వచ్చిన తరువాత 50 శాతానికి పెరుగుదల
- ప్రభుత్వంపై ఏటా రూ.54 కోట్ల భారం



అనకాపల్లి కాంప్లెక్స్‌లో పాయకరావుపేట వెళ్లే బస్సు వద్ద మహిళా ప్రయాణికుల రద్దీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు తరువాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నది. ఈ పథకం ప్రారంభానికి ముందు వరకు సంబంధిత ఐదు రకాల బస్సు సర్వీసుల్లో ప్రయాణించే వారిలో 30-35 శాతం మంది మాత్రమే మహిళలు వుండేవారు. గత నాలుగు రోజుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య 50 శాతానికి పెరిగినట్టు అధికారులు వెల్లడించారు.

తేదీ	ప్రయాణించిన మహిళలు	జీరో ఫేర్ టికెట్ల విలువ
16	21,345	రూ.8,31,280,
17	30,001	రూ.11,94,230,
18	34,412	రూ.13,45,715,
19	35,069	రూ.12,71,255

గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే నాలుగింటిని అమలు చేసిన కూటమి ప్రభుత్వం.. ఈ నెల 15వ తేదీ నుంచి 'స్త్రీ శక్తి' పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, యువతులు, థర్డ్ జెండర్లు ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో ఉచితం ప్రయాణించ వచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ పథకం అమలులోకి వచ్చిన నాటి నుంచి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పెరిగింది. అంతకుముందు జిల్లాలోని రెండు డిపోల పరిధిలో 180 బస్సులు రోజూ 65 వేల కిలోమీటర్ల దూరం రాకపోకలు సాగించేవి. రోజుకు సగటున 50 వేలమంది ప్రయాణించేవారు. వీరిలో 15 వేల నుంచి 18 వేల వరకు మహిళలు ఉండే వారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసిన తరువాత నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. ఆర్టీసీ అధికారుల గణాంకాల ప్రకారం ఐదు రకాల బస్సు సర్వీసుల్లో ఈనెల 16న 32,517 మంది పురుషులు, 21,345 మంది మహిళలు (జీరో ఫేర్ టికెట్) ప్రయాణించారు. 17వ తేదీన పురుషులు 31,264 మంది, మహిళలు 30,001 మంది, 18వ తేదీన పురుషులు 36,118 మంది, 34,412 మంది, 19వ తేదీన 30,856 మంది పురుషులు, 35,069 మంది మహిళలు ప్రయాణించారు.



బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడుతున్న డీపీటీవో ప్రవీణ

ఏటా రూ.54 కోట్ల భారం

స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతో అనకాపల్లి జిల్లాకు సంబంధించి ప్రభుత్వంపై ఏటా రూ.54 కోట్లకుపైగా ... మిగతా 8వ పేజీలో

మహిళలు చాలా సంతోషం



స్త్రీ శక్తి పథకాన్ని జిల్లా మహిళలు బాగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, చోడవరం, వి.మాడుగుల రూట్లలో గతంలో 40 శాతం ఉన్న మహిళా ప్రయాణికుల ఆక్యుపెన్సీ.. ఉచిత పథకం అమలు తరువాత 80 శాతానికి పెరిగింది. బస్సుల్లో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నట్టు గత నాలుగు రోజుల్లో ఒక్క మహిళ కూడా ఫిర్యాదు చేయలేదు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళలు చాలా సంతోషంగా ఉన్నారు.

కె.ప్రవీణ, డీపీటీవో, అనకాపల్లి

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్ ఒకరి మృతి

- నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన లచ్చబాబు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండలం పల్లావూరు శివారులో ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన కొంతమంది భవన నిర్మాణ కార్మికులు బుధవారం ఉదయం కొయ్యూరు మండలం గుడ్లపల్లిలో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఆటోలో తిరుగుముఖం పట్టారు. దారిలో సీహెచ్. నాగాపురం పంచాయతీ పల్లావూరు శివారులో ఎదురుగా కృష్ణాదేవిపేట నుంచి కొయ్యూరు వైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొన్నది. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏఎల్‌పురం గ్రామానికి చెందిన ముద్దల లచ్చబాబు అలియాస్ చిన్నా (35) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్య సేవలు పొందుతూ మృతిచెందాడు. ఇదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మడపల దుర్గాప్రసాద్, బొడ్డేపు కుమారి, బర్నికల దేముడమ్మ, కుండల చిట్టిబాబు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకి, అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కొయ్యూరు ... మిగతా 8వ పేజీలో

వరి నాట్లకు కూలీల కొరత

భారీ వర్షాలతో చెరువులు, పొలాల్లో చేరిన నీరు

- ముమ్మరంగా దమ్ము పనులు చేపట్టిన రైతులు
- ఒకేసారి నాట్లు వేస్తుండడంతో కూలీలకు డిమాండ్
- సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు కూలి
- అయినాసరే చెల్లించడానికి సిద్ధపడుతున్న రైతులు
- ఆలస్యం అయితే నారు ముదిరిపోతుందని ఆందోళన



చినపాచిలలో వరినాట్లు వేయడానికి రైతులు దమ్ము చేసి సిద్ధంగా ఉంచిన పొలాలు

రావికమతం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

ఇటీవల వరకు వర్షాల కోసం ఎదురు చూసిన రైతులు.. ఇప్పుడు వరినాట్లు వేయడానికి కూలీలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు రోజులపాటు భారీ వర్షాలు పడడంతో రైతులు పొలాలను దమ్ము చేసి, నాట్లుకు సిద్ధం చేశారు. మరోవైపు ఆకుమడుల్లో వరినారు అందుబాటులోకి వచ్చింది. వరినాట్లు వేద్దామంటే కూలీలు లభించని పరిస్థితి ఏర్పడింది. వరినాట్లు ఆలస్యమైతే నారు ముదిరిపోతుందని, మరోవైపు పొలంలో నీరు తగ్గిపోయి నాట్లు మరింత ఆలస్యం అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



రావికమతం పొలాల్లో వరినాట్లు వేస్తున్న కూలీలు

రావికమతం మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఐదు వేల హెక్టార్లల్లో వరిసాగు చేయడానిక రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. కల్యాణపులోవ జలాశయం ఆయకట్టు మినహా మిగిలిన భూములన్నీ వర్షాధార చెరువుల కింద వున్నాయి. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మండలంలో మూడు, నాలుగు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరింది. పంటపొలాలు నీటమునిగాయి. సోమవారం రాత్రి నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు దమ్ము పనులు మొదలుపెట్టారు. దమ్ము చేయడానికి ట్రాక్టర్లు అందుబాటులో వున్నప్పటికీ, వరినాట్లు వేయడానికి సరిపడ కూలీలు లేరు. సాధారణంగా పొలం పనులకు వచ్చే మహిళా కూలీలకు రోజుకు రూ.300 చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు రైతులంతా ఒకేసారి వరినాట్లుకు సిద్ధపడడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. వరి నాట్లు ఇప్పటికే ఆలస్యం అయ్యాయని, వెంటనే నాట్లు వేయకపోతే నారు ముదిరిపోవడంతోపాటు పంట దిగుబడులపై ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో రెట్టింపు కూలి అయినా చెల్లించి, సత్వరమే వరినాట్లు పూర్తిచేయాలని తొందర పడుతున్నారు. సొంతూరులో కూలీల లభ్యత లేకపోతే సమీప గ్రామాల నుంచి ఆటోల్లో కూలీలను తీసుకువస్తున్నారు. కూలి డబ్బులతోపాటు ఆటో చార్జీలను కూడా రైతులే చెల్లిస్తున్నారు. దమ్ము చేసిన ఒకటి, రెండు రోజుల్లో వరినాట్లు వేయకపోతే పొలంలో నీరు ఉండదేమోనన్న ఉద్దేశంతో వ్యవసాయ కార్మికులు అడిగినంత కూలి ఇవ్వక తప్పనిసరి పరిస్థితి రైతులకు ఏర్పడింది.


ప్రహసనంగా పింఛన్ల ఏరివేత

అర్హులైన దివ్యాంగులకు నోటీసులు

- వైకల్య నిర్ధారణ పరీక్షల తీరుపై విమర్శలు
- మరోవైపు జాబితాలో కానరాని అనర్హుల పేర్లు



కలిగొట్ల శ్రీనివాసరావు. (ఇన్‌సెట్‌లో) బోదకాలు సమస్య



చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

నకిలీ ధ్రువపత్రాలతో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిని అర్హుల జాబితాల నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ప్రహసనంగా మారింది. బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందిన వారి పేర్లు ఈ జాబితాలో లేకపోగా, అర్హులైన వారిలో పలువురికి ప్రస్తుతం నోటీసులు జారీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దివ్యాంగ పింఛన్ల మంజూరు అడ్డగోలుగా సాగింది. అంగవైకల్యం లేకపోయినప్పటికీ రాజకీయ పలుకుబడి, సదరం శిబిరాలలో వైద్యులను మేనేజ్ చేశారు. అంగ వైకల్యం, మానసిక వైకల్యం, ఇతర వైకల్యాల పేరిట అనేక మంది బోగస్ సర్టిఫికెట్లు పొంది ప్రతినెలా పింఛన్ డబ్బులు తీసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగ పింఛన్ల వడపోతకు ప్రత్యేక వైద్య బృందాలతో వైలక్య నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. వీరు ఇచ్చిన నివేదికల ఆధారంగా అనర్హులైన దివ్యాంగ పింఛన్‌దారులకు నోటీసులు జారీ చేశారు. 85 శాతం వైకల్యం ఉండి, మంచానపడిన వారికి యథావిధిగా రూ.15 వేలు, 85 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారిని రూ.6 వేల పింఛన్‌కు మార్పు చేయనున్నట్టు నోటీసుల్లో పేర్కొన్నారు. 40 శాతానికి పైబడి వైకల్యం ఉన్నవారికి యథావిధిగా రూ.6 వేలు పింఛను వస్తుందని, అయితే 40 శాతం కంటే తక్కువ వైకల్యం వుండి, ఇప్పటికే 60 సంవత్సరాలు దాటి ఉంటే రూ.4 వేల పింఛను ఇస్తామని, లేనిపక్షంలో వారికి సెప్టెంబరు నుంచి పింఛన్ ఆగిపోతుందని నోటీసుల్లో స్పష్టం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ... 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందంటూ నోటీసులు అందుకున్న దివ్యాంగుల్లో ఎక్కువ శాతం మందిఇ అర్హులైన వారు ఉండడం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. 60 నుంచి 70 శాతం వైకల్యం ఉన్నవారిని, పుట్టుకతో పోలియో ఉన్న వారిని 40 శాతం వైకల్యం జాబితాలో చేర్చి, వారికి నోటీసులు ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు మరోసారి అప్పీలు చేసుకోవడంతోపాటు, విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి నిర్ధారణ చేయించుకోవాలని చెబుతుండడంతో అర్హులైన దివ్యాంగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు నిక్షేపంగా వుండి, ప్రలోభాలతో ... మిగతా 8వ పేజీలో

గంజాయి గుప్పు.. ఎవరిది తప్పు?

దర్జాగా జిల్లాను దాటి ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతున్న కిలోల కొద్దీ గంజాయి

- జిల్లా సరిహద్దులోని చెక్ గేట్లు దాటి వెళుతుండడంపై అనుమానాలు
- తాజాగా అనకాపల్లి జిల్లాలో 736 కిలోలు పట్టివేత
- ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి ఇక్కడి వరకు ఎలా వచ్చిందనేది ప్రశ్నార్థకం
- రవాణాకు సహకరిస్తున్న వారెవరో?
- స్మగ్లర్ల వాహనాల్లో పోలీసులు తిరుగుతున్నా ఉన్నతాధికారులు మౌనం
- ఇలా అయితే గంజాయి కట్టడి సాధ్యమేనా అని పలువురి సందేహం



మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు వద్ద సోమవారం గంజాయితో పట్టుబడిన నిందితులు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి కిలోల కొద్దీ గంజాయి అల్లూరి జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతోంది. ఏజెన్సీలోనిచెక్ గేట్లను దాటి రవాణా అవుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక పోలీసుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా రవాణా అయి తాజాగా అనకాపల్లి జిల్లాలో మూడు చోట్ల 736 కిలోల గంజాయి ఒకే రోజు పట్టుబడడం కలకలం రేపింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పట్టుబడుతున్న గంజాయి ఒడిశా నుంచి దిగుమతి అవుతుందని పోలీసులు చెబుతున్నప్పటికీ, అది ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో రెండు రాష్ట్రాలకు చెందిన సరిహద్దు భూభాగంలో సాగవుతుందనే వాదన బలంగా వినిపిస్తున్నది. అలాగే గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న నిందితులు సైతం ఇతర రాష్ట్రాల వారి కంటే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వారే అధికంగా ఉండడంతో ఈ గంజాయి ఎక్కడిదనే అనుమానం కలుగుతున్నది. సోమవారం అనకాపల్లి జిల్లాలో మూడు చోట్ల పట్టుబడిన గంజాయి కేసుల్లో 16 మంది నిందితుల్లో 14 మంది అల్లూరి జిల్లాకు చెందిన వాళ్లే ఉన్నారు. వాస్తవానికి ఆయా కేసుల్లోని నిందితులు ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వారుండడం సహజం. కానీ అందుకు భిన్నంగా అల్లూరి జిల్లాకు చెంది వాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. దీంతో ఈ గంజాయి వాస్తవంగా ఒడిశా నుంచి దిగుమతి అయిందా?, లేక ఈ జిల్లాలోనే పండించారా? అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఒడిశాకు చెందిన గంజాయే అనుకుంటే, జిల్లాకు చెందిన స్మగ్లర్లు అధికంగా ఉన్నారంటే, వారిపై జిల్లాలో పోలీసులకు కనీస నిఘా లేదని స్పష్టమవుతున్నది. దీంతో ఉమ్మడి విశాఖపట్నం లేదా ఇతర ప్రాంతాల్లో పట్టుబడుతున్న గంజాయి కేవలం ఒడిశా రాష్ట్రానికి చెందినదిగా ముద్రవేసి మిన్నకుంటే, చాపకింద నీరులా అల్లూరి జిల్లాలో గంజాయి సాగు పెరిగే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని గంజాయి సాగు, రవాణాపై పోలీసు యంత్రాంగం మరింత పటిష్టంగా, పారదర్శకంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్షేత్ర స్థాయి పరిస్థితులపై ఉన్నతాధికారులకు సంపూర్ణ అవగాహన లేకపోవడం, స్టేషన్లలో ఉండే అధికారుల పైనే పూర్తిగా ... మిగతా 8వ పేజీలో

ఎస్.రాయవరంలో వైసీపీకి ఎదురుదెబ్బ

ఎంపీపీతోసహా ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు రాజీనామా

- మరో ఐదుగురు సర్పంచులు కూడా..
- గతంలోనే వైసీపీని వీడిన వైస్ ఎంపీపీ గోవిందరావు
- టీడీపీలో చేరతారని ఊహాగానాలు



మీడియా సమావేశంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, ఎంపీపీ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ శారదాకుమారి, ఇతర ప్రజాప్రతిధులు

ఎస్.రాయవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలో వైసీపీ మరో ఎదురుదెబ్బ తగిలింది. ఎంపీపీతోపాటు ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, ఐదుగురు సర్పంచులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం ఇక్కడ ఎంపీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయం ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శారదాకుమారి (చినగుమ్ములూరు ఎంపీటీసీ) మాట్లాడుతూ, మండలంలో వైసీపీ అభివృద్ధి కోసం తన భర్త బొలిశెట్టి గోవిందరావు (ఎస్.రాయవరం-2 ఎంపీటీసీ) ఎంతో శ్రమించామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపీటీసీలు, సర్పంచులను గెలిపించుకున్నామని ... మిగతా 8వ పేజీలో

సాగునీటి కాలువ కబ్జా

- గ్రావెల్, రాళ్లతో పూడ్చేస్తున్న రియల్టర్లు
- పొలాలకు నీరు అందక రైతుల ఇక్కట్లు



జాతీయ రహదారి పక్కన పంట కాలువను గ్రావెల్‌తో కప్పేసిన దృశ్యం

కొత్తూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):

సాగునీటి కాలువలను భూ కబ్జాదారులు, రియల్టర్లు కప్పేస్తున్నారు. దీంతో పొలాలకు నీరు అందక రైతులు పంటలు పండించుకోలేకపోతున్నారు.

అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతున్నది. ఇక్కడ పశ్చిమం నుంచి తూర్పు వైపునకు పంట కాలువ వుంది. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములకు గిరాకీ పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి వాణిజ్య అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్నారు. ఈ క్రమంలో పంచాయతీకి 'నాలా' పన్ను చెల్లించడంలేదు. పైగా పంట కాలువను గ్రావెల్, రాళ్లతో కప్పేస్తున్నారు. దీనివల్ల దిగువున ఉన్న పొలాలకు నీరు రావడంలేదు. తక్షణమే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి సాగునీటి కాలువను ఆక్రమించి, పూడ్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా పంట కాలువను పూర్వస్థితికి తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పంట కాలువకు అడ్డంగా వేసిన రాళ్ల కుప్ప

ఉత్సాహంగా ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

» మహిళల విభాగంలో విశాఖ, పురుషుల విభాగంలో కృష్ణా జిల్లాల జట్లు విజేతలు


మహిళల ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుతో తలపడుతున్న విశాఖ జట్టు


పురుషుల విభాగంలో అతిథుల నుంచి కప్ అందుకుంటున్న కృష్ణా జిల్లా జట్టు

మునగపాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులాపల్లిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి మహిళా, పురుషుల కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో మహిళా విభాగంలో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. శ్రీకాకుళం జట్టుపై భారీ విజయం సొంతం చేసుకుంది. పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లాల జట్లు తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచాయి.

పురుషుల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు శ్రీకాకుళం జిల్లా జట్టుతో తలపడి విజేతగా నిలిచింది. తృతీయ, చతుర్థ స్థానాల్లో అనకాపల్లి, కడప జట్లు నిలిచాయి. టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనువాసరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు కప్‌తో పాటు షీల్డ్, నగదును అందజేశారు. ఈ నెల చివరి రోజు పోటీలను వీక్షించేందుకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితర ప్రముఖులు విచ్చేశారు. వారంతా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల కోసం అవస్థలు

» కళాశాలలు విడిచిపెట్టిన అనంతరం గంటన్నర పాటు ఎలమంచిలి స్టాండ్‌లో విద్యార్థినీ విద్యార్థులు నిరీక్షణ

» ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారికీ తప్పని ఇబ్బందులు » ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని వేడుకోలు


రాత్రి 6.49 గంటల సమయంలో బస్సు రావడంతో దానిని ఎక్కేందు విద్యార్థినీ విద్యార్థుల అవస్థలు

ఎలమంచిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : చాలీచాలని ఆర్టీసీ బస్సులతో ఇక్కడ విద్యార్థులతో పాటు అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం సాయంత్రం ఇదే పరిస్థితి ఎదురైంది. విద్యార్థులు బస్సుల కోసం సుమారు గంటన్నరకు పైగా పడిగాపులు కాయాల్సి వచ్చింది. రాత్రి 6.45 గంటల వరకూ విద్యార్థినులు స్టాండ్‌లోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎలమంచిలి పట్టణంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఇటు తాళ్లపాలెం, అటు అడ్డురోడ్డు, నక్కపల్లి పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థుల పెద్ద సంఖ్యలో రోజూ వచ్చి వెళుతుంటారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకు కళాశాలలు విడిచిపెట్టడంతో వారంతా బస్టాండ్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి అనకాపల్లి వైపునకు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఒకటి వచ్చినప్పటికీ రద్దీ ఎక్కువగా ఉండడంతో వారు ఆ బస్సులో ఎక్కలేక పోయారు. ఆ తరువాత చాలా సేపటికి బస్సులు రాక పోవడంతో వారు ఒకింత అసహనానికి గురయ్యారు. బస్టాండ్‌లో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి బస్సుల విషయమై 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రశ్నించగా, బస్సులు రావాల్సి ఉందన్నారు. సుమారు గంటన్నరకు పైగా బస్సుల కోసం వేచి ఉండాల్సి రావడంతో విద్యార్థినీ విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు 6.49 నిమిషాలకు అనకాపల్లి వైపు వెళ్లాల్సిన పల్లె వెలుగు బస్సు రావడంతో ఆ బస్సు ఎక్కేందుకు పోటీపడ్డారు. అష్టకష్టాలు పడి చివరకు బస్సు ఎక్కగలిగారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బస్సుల కొరత లేకుండా చూడడంతో పాటు సకాలంలో వచ్చేలా చర్యలు చేపట్టాల్సిందిగా వారంతా కోరారు.

'ప్రముఖ పర్యాటక కేంద్రంగా కొండకర్ల ఆవ'


ఆవలో దోనెల పోటీ జరుగుతున్న దృశ్యం

అచ్యుతాపురం/రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రంగా కొండకర్ల ఆవను తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా కొండకర్ల ఆవ ప్రాంతంలో వెయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడకు విదేశీనుంచి పక్షులు వచ్చేవని, ఆవ ఆక్రమణకు గురై చెట్లు లేకపోవడంతో విదేశీ పక్షులు రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని చెట్లు పెంచటానికి ప్రణాళిక రూపొందించామన్నారు. అలాగే ఆవలో ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని వివరించారు. ఆయన జన్మదినం సందర్భంగా కొండకర్ల ఆవలో తాటి దోనెల పోటీని నిర్వహించారు. ఈ పోటీల్లో 36 దోనెలు పాల్గొన్నాయి. కొండకర్లకు చెందిన సైదు రమాశంకర్ దోనె ప్రథమ, వాడ్రాపల్లికి చెందిన పిల్లి ప్రసాద్ దోనె ద్వితీయ, కొండకర్లకు చెందిన పెంటయ్య దోనె తృతీయ స్థానంలో నిలిచాయి.

ఘనంగా ఎమ్మెల్యే 'సుందరపు' జన్మదిన వేడుకలు

» ఆనందంగా జరుపుకున్న కూటమి శ్రేణులు

» పలుచోట్ల కేక్ కట్‌చేసిన విజయ్‌కుమార్ » శుభాకాంక్షల వెల్లువ


హరిపురంలో సోదరుడు సతీష్‌కుమార్‌తో కలిసి కేక్‌కట్ చేస్తున్న విజయకుమార్

రాంబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపురం జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే విజయకుమార్ తన స్వగ్రామమైన కొత్తూరులో గల తమ కుటుంబ ఆరాధ్య దేవత గుమ్మడిఅమ్మలు పేరంటాలును కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తూరులో మాజీ సర్పంచ్ నానేపల్లి సాయివరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయకుమార్ పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం హరిపురం జనసేన కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే తన సోదరుడు సతీష్‌కుమార్‌తో కలిసి కేక్‌కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరక్టర్ ధూళి రంగనాయకులు, నేతలు బైలపూడి శ్రీరామరామదాసు, పప్పల నూకన్నదొర, శ్రీనివాసరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు లాలం భరత్, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన కూటమి నేతలు, కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపి సత్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు

అచ్యుతాపురం : ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. పూడిమడకలో టీడీపీ సీనియర్ నేత మేరుగు బాపు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రాంబిల్లి మండలం వెంకటాపురం జంక్షన్ వద్ద జనసేన కార్యాలయంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఖాజీపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీ రామ్ పాఠశాలలో మొక్కలు నాటారు. దోసూరు పాఠశాలలో కూడా కూటమి నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, పీలా సందీప్, నీరుకొండ నర్సింగరావు, రాజాన అప్పారావు మాస్టారు, గుర్రం గోవింద్, లాలం రాజు, మేరుగు వెంకటరావు, సమ్మింగి లక్ష్మణ, మేరుగు మహేష్ పాల్గొన్నారు.


అచ్యుతాపురం మండలం పూడిమడకలో జన్మదిన వేడుకలు

ఎలమంచిలి : ఇక్కడి జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను కూటమి నేతల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. కూటమి నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, పిట్టా శ్రీను తదితరులంతా ఎమ్మెల్యే ఇటువంటి వేడుకలు ఎన్నెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాకతో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే విజయకుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడి జనతా గ్యారెజ్ కార్యాలయంలో కాండ్రేగుల పరదేశిరావు, సంధ్య దంపతుల ఆధ్వర్యంలో జనసేన నాయకుడు సుందరపు వెంకట సతీష్‌కుమార్ కేక్ కట్‌చేశారు. అదే విధంగా ఇక్కడి జనసేన కార్యాలయంలో పార్టీ మండలఅధ్యక్షుడు టెక్కలి పరశురాం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. స్థానిక కుట్టు శిక్షణ కేంద్రం వద్ద టీడీపీ నాయకుడు ఆడారి గణేశ్ సారథ్యంలో కేక్‌కట్ చేశారు. జడ్పీ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ వేడుకల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంధురాలి పెన్షన్ పునరుద్ధరించేవరకు ఆర్థిక సాయం

టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రాజబాబు


పెన్షన్ తొలగించిన అంధురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకుడు గొర్లె రాజబాబు

పాయకరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పింఛన్ రద్దయిన నిరుపేద కుటుంబానికి చెందిన అంధురాలికి తిరిగి పునరుద్ధరించేవరకు నెలనెలా పెన్షన్ సొమ్మును అందజేస్తానని మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్లె రాజబాబు హామీ ఇచ్చారు. బుధవారం అంధురాలు ఈగల శాంతిదేవి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనవంతు తక్షణ సాయంగా రూ.6 వేల నగదును శాంతిదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన ఈగల శాంతిదేవి పుట్టినప్పటి నుంచి అంధురాలు కాగా, 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సామాజిక పెన్షన్ మంజూరైందన్నారు. తల్లిదండ్రుల వృద్ధాప్యం కారణంగా శాంతిదేవికి వచ్చే పెన్షన్ కుటుంబానికి జీవనాధారమన్నారు. ఇటీవల అధికారులు చేపట్టిన సర్వే, సదరన్ క్యాంపులో శాంతిదేవికి 40 శాతం అంధత్వం ఉన్నట్టు చెప్పి పెన్షన్ రద్దయినట్టు నోటిసు అందజేశారన్నారు. గతంలో నిర్వహించిన సదరన్ క్యాంపులో శాంతిదేవికి వంద శాతం అంధత్వం ఉందని తేల్చిన అధికారులు, ఇపుడు 40 శాతం మాత్రమే ఉందని చెప్పడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకునివెళ్లి పెన్షన్ పునరుద్ధరించేలా కృషి చేస్తానని, అంతవరకు ప్రతి నెలా శాంతిదేవికి రూ.6 వేలు చొప్పున అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి రాజా, బి.శివ, జగతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతోనే సమస్యల పరిష్కారం

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ చిన్నారావు

అధికారులు జవాబుదారీగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ చిన్నారావు... పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు

కోటవురట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో సిబ్బంది సహకరిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ఏపీడీ చిన్నారావు స్పష్టం చేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను గ్రామాల్లో ఉద్యోగులు వెంటనే పరిష్కారించాలని సూచించారు. అలాగే ప్రజలకు అధికారులు, ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కింద స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మండల స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ వద్ద తలదించుకోవాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితి రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. కలెక్టర్ నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాసరావు, మండల ఇంజనీరింగ్ అధికారి వర్మ, వెలుగు ఏపీఎం సత్యవతి, ఉపాధి పథకం ఏపీవో నాగరాజు, వైద్యాధికారి ప్రతాప్ పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవడమే ముఖ్యమంత్రి ధ్యేయం

» టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం


ధర్మవరం అగ్రహారంలో లక్ష్మీకాంతంకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అన్ని వర్గాలకు పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన కొనసాగిస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం అన్నారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన వైబోయిన లక్ష్మీకాంతం మోకాలి చిప్ప మార్పిడి ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.70 వేల చెక్కును బాధితురాలికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యంపై సీఎం వెంటనే స్పందిస్తున్నారన్నారు. లక్ష్మీకాంతం వైద్య సహాయం కోసం నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుతో పాటు హోం మంత్రి వంగలపూడి అనితకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సియ్యాదు అచ్యుత్‌కుమార్, టీడీపీ నాయకులు సుంకర శ్రీనివాసరావు, బండి నాగేశ్వరరావు, బండి బాబూరావు, వైశివనాగేశ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు 'పేట' విద్యార్థులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నరసింహారావు తదితరులు

పాయకరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో వారు అత్యుత్తమ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ బుధవారం విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ యోగా పోటీల్లో అండర్-14 విభాగంలో తమ విద్యార్థులు చైతన్యసాగర్ నాయుడు, మౌళీశ్వర్, చైతన్యతేజ, అశ్రిత్ చరణ్‌కుమార్ బృందం, వ్యక్తిగత విభాగంలో చరణ్‌కుమార్ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారన్నారు. అలాగే అండర్-17 విభాగంలో జి.సోమసూర్యచరణ్, బి.దేవాన్ష్‌నాయుడు, పి.సోహన్‌శ్రీ, సిహెచ్.జయదీప్, సీహెచ్.రక్షిత్ బృందం ప్రథమ స్థానం సాధించారన్నారు. వచ్చే నెల 13 నుంచి 16వ తేదీ వరకు హరియాణాలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు వీరు ఎంపికయ్యారన్నారు. అలాగే సంప్రదాయ ఈవెంట్‌లో జి.సోమసూర్యచరణ్ బంగారు పతకం, దేవాన్ష్‌నాయుడు రజిత పతకం, సిహెచ్.రక్షిత్ కాంస్య పతకం, పి.సోహన్ నాలుగో స్థానం సాధించారన్నారు. వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాశ్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, యోగా గురువులు సురేశ్, జయంతి అభినందించారు.


ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా విద్యార్హత, అన్ని రకాల ధ్రువపత్రాలతో స్థానిక ప్రభుత్వ ఐటీఐకి వచ్చి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే 27న సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుని, 29న ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం స్థానిక ఐటీఐ కళాశాలలో సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

వరిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ చెప్పారు. మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో తగిన మోతాదులో ఎరువులను వినియోగించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేయాలన్నారు. ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ప్రియాంక, వీరబాబు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు ఓరుగుంటాలమ్మ జాతర


ఓరుగుంటాలమ్మ

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అరట్లకోట గ్రామంలో ఓరు గుంటాలమ్మ జాతర మహోత్సవం గురువారం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. పాయకరావుపేట, తుని తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని వారికి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తా మని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతరను జయప్రదం చేయాలని వారు కోరారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్ల వితరణ

నక్కపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఎల్ పురం-1 మోడల్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న సుమారు 80 మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు సొంత నిధులతో భోజనం ప్లేట్లు (స్టీలు కంచాలు) కొనుగోలు చేసి కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మాడెం సత్యనారాయణ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నానాజీ, ఉపాధ్యాయులు సతీశ్, విజయలక్ష్మి, మంగరత్నం ఈ ప్లేట్లను పంపిణీ విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు ఉపయోగకరమైన ప్లేట్లను అందించిన ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

కౌమార దశలో వివాహాలు వద్దు

▸▸ అవగాహన సదస్సులు నిర్వహించండి ▸▸ పిల్లలకు హక్కులు, చట్టాలను వివరించండి ▸▸ అధికారుల సమీక్షలో కలెక్టర్



బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో వివాహాలు జరగకుండా మండల, గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం మాసాంతపు జిల్లాస్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల, గ్రామ, వార్డుల పరిధిలో బాలల సంక్షేమ, రక్షణ కమిటీలను ఏర్పాటు చేసి బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా జరగకుండా, బాలలతో భిక్షాటన వంటివి చేయకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలలు మత్తు మందులకు బానిస కాకుండా చూడడంతో పాటు వారిలో స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని కమిటీ సభ్యులకు కలెక్టర్ సూచించారు. పిల్లలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించి, బాల బాలికలతో వేర్వేరుగా సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'నిర్వాసిత గ్రామాల్లో ఎన్టీపీసీ సేవలు అభినందనీయం'



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నిర్వాసిత గ్రామాల్లో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సంస్థ సీఎస్‌ఆర్ నిధులు రూ.50 లక్షలతో నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెంలో నూతనంగా నిర్మించనున్న బీసీ బాలికల వసతి గృహ భవన నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సింహాద్రి యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం లుపిన్ ఫౌండేషన్ సమకూర్చిన నోట్ పుస్తకాలను వసతి గృహం బాలికలకు పంపిణీ చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌ఆర్ విభాగం డీజీఎం బీబీ పాత్ర, బీసీ వెల్ఫేర్ డీడీ శ్రీదేవి, ఎంపీడీవో రమేష్‌నాయుడు, మేట్రిన్ రజని, సీఎస్‌ఆర్ ప్రతినిధులు ప్రకాశరావు, శివం, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు కూండ్రపు సీతారామయ్య, చింతకాయల ముత్యాలు, వియ్యపు చిన్న, బొడ్డపు శ్రీనివాసరావు, మోటూరి సన్యాసినాయుడు, అర్జిల్లి రవి, వెలుగుల అనిల్‌కుమార్, వర్రి పరదేశినాయుడు, కరణం నరసింగరావు పాల్గొన్నారు.

'స్ఫూర్తి'ని సంచార జాతులు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

కొత్తూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 30న సంచార, అర్ధ సంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని విజయవాడలో 'స్ఫూర్తి' పేరిట నిర్వహించనున్నామని బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంచార జాతుల కళలను, వారి నైపుణ్యాలను గుర్తించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్టు చెప్పారు. జిల్లా నలుమూలల ఉన్న సంచార జాతుల వారు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి కర్రి రామకృష్ణ, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చింనాయుడు, తలుపులు రాజు, మైచర్ల మూర్తి, కె.వరహాలు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయం రోడ్డులో అభివృద్ధి పనులు



డ్రైన్ల నిర్మాణానికి ఎక్స్‌కవేటరుతో పనులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం నుంచి ఏడీ స్కూల్ వరకు డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. నూకాంబిక ఆలయ పరిసర ప్రాంతాల్లో మురుగు రోడ్లపై ప్రవహించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ దృష్టికి తీసుకు వెళ్లారు. వారు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వివరించడంతో ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారుల సమక్షంలో కూటమి నాయకులు పనులు ప్రారంభించారు. ఎక్సకవేటర్ సహాయంతో కాలువల నిర్మాణ పనులు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా



బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

కొత్తూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలంటూ అనకాపల్లి ఎల్ఐసీ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు మాట్లాడుతూ గ్రూప్ ఇన్సూరెన్స్ వయోపరిమితి 69 ఏళ్ల నుంచి 85 ఏళ్లకు పెంచాలని, బీమా ఏజెంట్లకు సంక్షేమ నిధి, పెన్షన్ అమలు చేయాలని, మెడిక్లెయిమ్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ హరగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కమిటీ సభ్యుడు గొర్లి శంకర్, ప్రతినిధులు కరణం మాణిక్యాలరావు, నడిశెట్టి అప్పారావు, ఉప్పునూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్ దుకాణంలో అగ్ని ప్రమాదం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న స్టాంప్ వెండర్ ఎం.జగదీశ్వరబాబుకు చెందిన దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. రాత్రి పన్నెండు గంటల సమయంలో స్టాంప్‌ల దుకాణం నుంచి మంటలు రావడాన్ని గమనించిన ఓ వ్యక్తి దుకాణ యజమానికి తెలియజేశారన్నారు. ఆయన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెంటనే వెళ్లి మంటలను అదుపుచేసినట్టు చెప్పారు. ఈ ఘటనలో స్టాంప్ షీట్స్, కంప్యూటర్లు, రికార్డు బాక్సు, ప్రింటర్లు, ఇన్వెర్టర్ బ్యాటరీ కాలిపోయాయని, వీటి విలువ రూ.రెండు లక్షల వరకు ఉంటాయని అగ్నిమాపక శాఖాధికారి నాగేశ్వరరావు అంచనాగా తెలిపారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి చేశారు.

గ్రామ పంచాయతీ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు మేలు చేసే 551, 680, 132 జీవోలు అమలు చేయాలని కోరారు. అలాగే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాయన బాబు, సోమినాయుడు, ఎస్.బ్రహ్మాజీ, దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. కమిటీ గౌరవాధ్యక్షులుగా ఆర్.శంకరరావు, జిల్లా అధ్యక్షుడిగా ములకలపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆడారి నాగేశ్వరరావు, కోశాధికారిగా నక్కా రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దాకారపు శ్రీనివాసరావుతో పాటు మరో 23 మంది ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

వరి పొలాల్లో నిల్వ నీటిని తొలగించండి

▸▸ రైతులకు జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచన



పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

తుమ్మపాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు వరి పొలాల్లో నీరు ఎక్కువగా ఉంటే వెంటనే తొలగించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. తుమ్మపాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. పొలంలో నీరు తొలగించిన తరువాత గ్రోమోర్ 28280ను ఎకరాకు 40 కేజీల చొప్పున కలిపి చల్లుకోవాలన్నారు. దమ్ములు పట్టిన రైతులు ఎకరాకు 50 కేజీల డీఏపీని వేసుకోవాలని వివరించారు. అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందకపోతే తక్షణమే రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. అలాగే తుమ్మపాల రైతు సేవా కేంద్రానికి మరో మూడు రోజుల్లో యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటన

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో వరి, చెరకు పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఈ పంటల సాగులో రైతుల పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కొన్ని చోట్ల ఉడుపులు కాని ఆకుమడిని పరిశీలించారు. పొడతెగులు నివారణకు ప్రోపికెనాజోల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. గొబ్బూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అదే విధంగా తాళ్లపాలెంలో చెరకు సాగులో ఉన్న పొలానికి ఎర్రకుళ్ళు తెగుళ్లను గుర్తించి నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, ఎన్.రాజ్‌కుమార్, పి.వి.పద్మావతి, వ్యవసాయ శాఖ ఏడీఏ సిహెచ్.సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారిణి ఎం.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించండి

▸▸ పాఠశాలల్లో పలువురు నాయకులు ప్రచారం



నిదానందొడ్డి స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల్లో మట్టి ప్రతిమలనే అంతా పూజించాలని గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర సూచించారు. పట్టణంలోని గవరపాలెం నిదానందొడ్డి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆయన మట్టి ప్రతిమను చేతబట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన విగ్రహాల వలన పర్యావరణం దెబ్బతింటుందన్నారు. మట్టి ప్రతిమల వలన ఇటువంటి పరిస్థితి ఉండదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు టీడీపీ నాయకులు పోలిమేర ఆనంద్, భానుచందర్ పాల్గొన్నారు. అలాగే మట్టి వినాయక ప్రతిమలతోనే పూజలు చేస్తామని గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సామూహిక వినాయక నిమజ్జన కమిటీ వైస్ చైర్మన్ మందపాటి జానకిరామరాజు విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. నిమజ్జన కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తకుల సంతోష్, అండిబోయిన మోహన్, వేగి కార్తీక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టేడియంలో వినాయక విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రత్నాకర్

భారీ వినాయక విగ్రహ ఏర్పాట్లను పరిశీలించిన రత్నాకర్

అనకాపల్లి టౌన్ : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 126 అడుగుల భారీ లక్ష్మీగణపతి విగ్రహం ఏర్పాట్లును బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదన్నారు. అనకాపల్లికి చెందిన ప్రఖ్యాతి శిల్పి కామధేను ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్తిగా మట్టితోనే వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తుండడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ కన్వీనర్ బుద్ధ భూలోకనాయుడు, శిల్పి కామధేను ప్రసాద్, బి.భాను ప్రకాష్, పి.రవికుమార్, ఆడారి సాయి, కోటిపల్లి శ్రీను, రేబాక మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను పరిశీలించిన అధికారులు



రోడ్డును పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ, జాతీయ రహదారి మేనేజర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని జాతీయ రహదారిలో గల నూకాలమ్మ ఆలయ ముఖద్వారం, కొత్తూరు, ఉమ్మలాడ జంక్షన్‌లతో పాటు తుమ్మపాలలోని రహదారులను బుధవారం అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, 16వ నంబరు జాతీయ రహదారి మేనేజర్ నవీన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించారు. ట్రాఫిక్ సూచికలు అమర్చారు. ప్రజల ప్రయాణ భద్రత దృష్ట్యా దెబ్బతిన్న రహదారుల పనులను చకచకా చేయిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని సీఐ వెంకటనారాయణ అభిప్రాయపడ్డారు. వర్షాకాలం అయినందున ప్రజలు ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలని సూచించారు.

అమరావతిపై జగన్‌రెడ్డిది విష ప్రచారం

▸▸ మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



తుమ్మపాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అండ్ కో విష ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కృష్ణా జిల్లాలో 19 సెంటీమీటర్ల వర్షం కురిసినా అమరావతి నీట మునగలేదన్నారు. కేవలం కక్ష పూరితంగానే అమరావతిపై జగన్‌రెడ్డి బురద జల్లుతున్నారని మండిపడ్డారు. అమరావతి పరిసర ప్రాంతాలకు జగన్‌రెడ్డి మీడియాను తీసుకొని వెళితే నిజం తేటతెల్లమవుతుందని వివరించారు. రాష్ట్రం అభివృద్ధిబాటలో పయనిస్తుందని, ప్రపంచ బ్యాంకుతో పాటు ఏషియన్ బ్యాంక్, నాబార్డు నిధులు సింగపూర్ ప్రభుత్వం ద్వారా 45వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో వివిధ సంస్థల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి కళ్లు తెరిచి విష ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

ప్లాస్టిక్ వల్ల అనర్థాలపై అవగాహన ర్యాలీ



సబ్బవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

సబ్బవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణానికి తీవ్ర విఘాతమని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద నారాయణరావు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ప్లాస్టిక్ నిషేధింపై సిబ్బందితో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వలన భూమి, నీరు కలుషితం అవుతాయన్నారు. ఇది జీవరాశులకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చైతన్య, కార్యదర్శి వై.రాజేశ్వరరావు, ఆశా వర్కర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పింఛన్లకు అనర్హులని నోటీసు ఇచ్చిన దివ్యాంగులకు మరో అవకాశం

సబ్బవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లకు అనర్హులుగా నోటీసులు అందుకున్న దివ్యాంగులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు తెలిపారు. వివిధ కారణాల వలన మండలంలోని 20గ్రామ సచివాలయాల పరిధిలో 232 మంది దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడం జరిగిందన్నారు. అయితే తాము అర్హులమని భావించేవారు వెంటనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం ఇచ్చినట్టు చెప్పారు. నోటీసులు అందుకున్నవారు సదరం శిబిరాల్లో మరోసారి వైకల్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీలోగా తమ వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలతో ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

లంకెలపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెంలో డీఆర్ఎస్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకుడు దుల్ల రామునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పరవాడ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి వెంకటరమణ, కరణం నరసింగరావు, జెర్రిపోతుల అప్పారావు, సాలాపు మోహన్, మడక వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా గ్రూపులు రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలి



రుణాల చెక్కులు అందజేస్తున్న గండి దేముడు

సబ్బవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గొటివాడ, సాయినగర్, గంగిరెడ్ల కాలనీ, గాలిభీమవరం గ్రామాలకు చెందిన ఐదు మహిళా సంఘాలకు ఇక్కడి దుర్గమాంబ పీఏసీఎస్ ద్వారా రూ.19 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి గండి దేముడు మాట్లాడుతూ రుణాలను సద్వినియోగం చేసుకుని తద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో గొంప రమణ, శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు, పీఏసీఎస్ పర్సన్లు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావు, కొరాడ శ్రీను, గొర్లి అచ్చింనాయుడు, పాల్గొన్నారు.

62 మంది హృద్రోగులకు పరీక్షలు

కొత్తూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీలో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యాభై సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత వ్యాధులపట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డి.వాసుబాబు సూచించారు. 50 ఏళ్లు దాటిన తరువాత స్వీట్లు, మటన్, రొయ్యలు, నెయ్యి, వెన్న, శీతల పానీయాలు తదితర ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 62 మంది హృద్రోగులకు పరీక్షలు జరిపి, మందుల అందజేశారు. శక్తి హెల్త్‌కేర్ సెంటర్ అధినేత రత్నాల ప్రకాశరావు ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం పట్ల అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

పరవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలోని గండివారి వీధి, బొంకులదిబ్బ, మండల పరిషత్ కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించాలన్న ఆలోచనతో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు గత ఏడాది వీటిని ఏర్పాటు చేసి అలాగే వదిలేశారు. అవి కొంత ఎత్తుగా ఉండి, రేడియం స్టిక్కర్లు, రంగులు వంటి లేకపోవడంతో వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో తరచూ పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఇటుగా ప్రయాణం అంటే పలువురు భయపడుతున్నారు. వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారులను వెంబడించే క్రమంలో వాహనాలను వేగంగా నడిపి ఇక్కడ ప్రమదాలకు గురై గాయపడిన సంఘటనలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు.

మలేరియా, డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండండి

▸▸ అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి



అనకాపల్లి అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో తదితరులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి భీమునిగుమ్మం ఉన్నత పాఠశాల వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, ఫైలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ప్రధాన కూడలిపై మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర, సహాయ మలేరియా అధికారి ఎ.జె.సత్యనారాయణ, స్థానిక మలేరియా సబ్ యూనిట్ అధికారి ఐ.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో...



కశింకోట మండలం తాళ్లపాలెంలో అవగాహన ర్యాలీ

కశింకోట : తాళ్లపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ ఎ.మనీషా మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమలు కుట్టకుండా వీలైనంత వరకు దోమల తెరలు వాడాలని సూచించారు. విధిగా ప్రతి వారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి.ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణం వేగవంతం: డీసీహెచ్‌ఎస్



నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీర్లతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ నీలవేణి

చింతపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌డివిజన్ కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రి భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం. నీలవేణి ఆదేశించారు. బుధవారం నిర్మాణంలోనున్న ఈ ఆస్పత్రి భవనాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, నాగార్జున కనస్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. నిర్మాణాలకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో సమకూర్చినట్టు చెప్పారు. భవన నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు.ప్రస్తుతం ఆస్పత్రి నిర్వాహణలోనున్న పాత భవనంలో రోగులు, వైద్యసిబ్బంది అవస్థలు పడుతున్నారన్నారు. పాత భవనంలో సర్దుకుని రోగులకు చికిత్స అందించాల్సివస్తోందన్నారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే సబ్ డివిజన్ పరిధి రోగులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రుక్మిణి, ఎల్‌టీ అనిల్, ఇంజనీర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జిల్లాకు గుర్తింపు తేవాలి : జేసీ



జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో జేసీ డాక్టర్.అభిషేక్ గౌడ

పాడేరురూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గిరిజన క్రీడాకారులు పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎంజే అభిషేక్ గౌడ సూచించారు. వచ్చే నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న వంతాల సింహాచలం, పాతుకోట రాజశేఖర్, తలారిసింగి సీఏహెచ్‌లో పదో తరగతి చదువుతున్న గల్లెల రామ్ చరణ్, బుల్లేరి చంద్రశేఖర్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు, కోచ్ పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



ఉత్సవాల నిర్వాహణకు పందిరిరాట వేస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డు.. ఎస్‌బీఐ సమీపంలోని పరిటాల వారి వీధిలో వినాయక ఉత్సవాలకు సంబంధించి బుధవారం పందిరి రాట వేశారు. ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధి సిద్ధినాతి కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, బీవీఎస్ ముకుందరావు, కొట్టగుళ్లి రామారావు, ఉప్పల వెంకటరత్నం, దొడ్డి ఈశ్వరరావు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శుల నియామకం

చింతపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు సాగిన కృష్ణపడాల్, కార్యదర్శిగా లకే వెంకటరమణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్ ధ్యేయం

» జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్



అమరావతిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారినుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంతో పార్టీ నిర్వహిస్తున్న ఈ గ్రీవెన్స్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో సమస్యలు పరిష్కారవుతున్నాయని శ్రావణ్‌కుమార్ ఈసందర్భంగా అన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తం

» జిల్లా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ వేణుగోపాల్



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

చింతపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచి స్పర్శ, చెడు స్పర్శ, శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ చెడు, మంచి స్పర్శపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా హద్దుమీరు ప్రవర్తిస్తే అక్కడ నుంచి దూరంగా వెళ్లిపోవాలన్నారు. అలాగే ప్రతి మహిళా విద్యార్థి సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలన్నారు. ఈ యాప్ వల్ల అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందవచ్చునన్నారు.ఈకార్యక్రమంలో స్థానిక ఎస్సై వి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ ప్రారంభం

పాడేరురూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీలో అడ్మిషన్‌లకు ఓఏఎండీసీ పోర్టల్‌లో రిజి స్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ బుధవారం నుంచి 26వ తేదీ మంగళవారం వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతుందన్నారు. ఈ నెల 24వ తేదీ ఆదివారం నుంచి 28వ తేదీ గురువారం వరకు వెబ్ ఆప్షన్, ఈ వెబ్ ఆప్షన్స్ మార్పులకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 31వ తేదీ ఆదివారం సీట్ కేటాయింపులు చేస్తామని, వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు



కొంతేలి గ్రామంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి కె. మాధురి

హుకుంపేట ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సేద్య పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి మాధురి సూచించారు. కొంతేలి గ్రామంలో బుధవారం తమ సిబ్బందితో కలిసి పొలాలను పరిశీలించారు. ఖరీఫ్‌లో అధిక దిగుబడిపై పలు మెలకువలను వివరించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లో చేరిన నీటిని కాలువల ద్వారా మళ్లించాలన్నారు. నారు కొనలు తుంచి వరినాట్లు వేస్తే చీడపీడలు పెద్దగా ఆశించవని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వ పరంగా ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది మోహన్, రైతులు పాల్గొన్నారు.

'రుణం తీర్చేసినా ... తిరిగి చెల్లించాలని ఒత్తిడి'



బ్యాంకు ఖాతా పుస్తకాలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న కించుమండలోని డ్వాక్రా సంఘం సభ్యులు

డుంబ్రిగుడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘం తరపున బ్యాంకునుంచి తీసుకున్న తీర్చేసినా ఇంకా అప్పు ఉందని బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని కించుమండ గ్రామానికి చెందిన దుర్గమ్మ డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శి అమ్మి, సీతమ్మతోపాటు సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ సంఘం ఎస్‌బీఐలో అప్పు తీసుకున్నామని, దశల వారీగా అప్పుతోపాటు పొదుపు చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో రుణం తీరిపోయినట్టు బ్యాంకు సిబ్బంది, వెలుగు సిబ్బంది తమకు తెలిపారన్నారు. మరో దఫా మిగిలిన నగదు డ్రా చేయడానికి తీర్మానం చేసుకుని బ్యాంకుకు వెళ్లామన్నారు. అప్పుడు తమ పొదుపు సంఘంలో రుణ బకాయి ఉన్నట్టు బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. వేరే ఖాతాను చూపి రుణం ఉన్నట్లు బ్యాంకు సిబ్బంది తెలియడంతో తమకు ఏం పాలుపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశా రు. తమ వ్యక్తిగత ఖాతాల లావాదేవీలను స్తంభింపజేయడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. దీనిపై గత నెల 18న పాడేరులో జరిగిన మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యా దు చేశామని, అయినా స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

పాడేరురూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార ఆధ్వ ర్యంలో వచ్చే నెల 13వ తేదీన జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయ స్థానంలో పెండింగ్ ఉన్న సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటారు ప్రమాదాల నష్టపరిహార కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంక్, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు తదితర రాజీకి వీలైన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని అన్నారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ఫోన్: 0891-2560414, 2575046లలో సంప్రదించాలని తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సీలేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలిక అదృశ్యమైనట్టు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఎస్‌ఐ కథనం ప్రకారం.. దుర్గవీధికి చెందిన ఆ బాలిక స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆమె గత శుక్రవారం నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బాలిక సమాచారం తెలిస్తే ఫోన్: 94409 04234కు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



కొత్తవీధి- మర్దపల్లి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

పెదబయలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిముడుపల్లి పంచాయతీ పరిధి కొత్తవీధి నుంచి మర్దపల్లి వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం స్థానిక సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ సభ్యురాలు కాసులమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ని ధులు రూ.1.5 కోట్లతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వంలో గిరిజన గ్రామాలు అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నాయన్నారు. గ్రామాలకు అనుసంధా నం చేస్తూ బీటీ రోడ్లు, వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు తదితర పనులు చురుగ్గా సాగుతున్నట్టు చెప్పారు. మర్దపల్లి వరకు రోడ్డు నిర్మాణం జరిగితే ఈ ప్రాంత ప్రజకు రవాణా కష్టాలు తీరుతాయన్నారు. నాణ్యతతో నిర్మాణ ప నులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మత్స్యరాజు, వార్డు సభ్యు లు కృష్ణ, దాన్న, ఈసుబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తమన్న , టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రా జారావు, స్థానిక నాయకులు రామారావు, మల్లేశ్వరరావు, సూర్యనారాయణ, సుందరరావు, రామారావు, చంటి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన నైపుణ్యకారుల ఎంపిక మేళా

పాడేరురూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాఫీ హౌస్‌లో ట్రైబల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో (ట్రైఫెడ్) 21వ తేదీ గురువారం గిరిజన నైపుణ్యకారుల ఎంపిక (ఎంపానెల్‌మెంట్ మేళా) (టీఏఈఎం)ను నిర్వహించనున్నట్టు ఆ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ద్వారా గిరిజన గ్రూపులు, వ్యక్తిగత గిరిజన నైపుణ్యం గల వ్యక్తులు ఎంపికకు అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని గిరిజన వీడీవీకే గ్రూపులు, వ్యక్తిగత గిరిజన నైపుణ్యకారులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ గూపు నుంచి పాల్గొన్న ఇద్దరికి ప్రయాణ భత్యం ఇస్తామన్నారు. అర్హత పొందిన నమూనా ఉత్పత్తులను ట్రైఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 8008674887, 7794921516 సంప్రదించాలన్నారు.

పీవీటీజీ గ్రామంలో సదుపాయాల కోసం వినతి



పీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు, మెట్టవీధి వాసులు

పాడేరురూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న చింతలవీధి పంచాయతీ ఉబ్బేడిపుట్టు మెట్టవీధి పీవీటీజీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాచిపెంట అప్పలనర్స కోరారు. బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడకు ఐటీడీఏ కార్యాలయంలో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్టవీధి గ్రామంలో పీవీటీజీ (కోందు) తెగకు చెందిన 200 మంది జీవనం సాగిస్తున్నారన్నారు. తాగునీరు సౌకర్యం లేక ఊట గెడ్డ నీటిపై ఆధారపడి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. స్పందించిన ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ పీఎం తక్షణం తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టడంతోపాటు వాటర్ ట్యాంకర్ ద్వారా గ్రామానికి నీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈకి ఆదేశాలు జారీ చేశారన్నారు. శాశ్వత తాగునీటి పథకం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారని అప్పలనర్స చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సుందరరావు, గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

'చోడిలో అగ్గి తెగులు నివారించాలి'



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్తలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రాగి (చోడి) పంటలో అగ్గి తెగులు వ్యాప్తి చెందిందని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్ రెడ్డి అన్నారు. బుధవారం శాస్త్రవేత్తల బృందం వర్షాల వల్ల నెలకొన్న పరిస్థితిని పరిశీలించేందుకు మండలంలోని ఎర్రచెరువులు, సంపంగిగొంది, సాగులు, బూసులు, ఏబులం, రింతాడ, దుశ్చరిపాలెం గ్రామాల్లో పర్యటించారు. పొలాలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వరి, వేరుశనగ, మొక్కజొన్న, రాగి, చిలగడు దుంప, పసుపు, అల్లం పంటలకు వర్షాలతో పెద్దగా నష్టం జరగలేదన్నారు. కొన్నిచోట్ల వాగుల గట్లు తెగి పొలాలపైకి వర్షపు నీరు రావడం వల్ల స్వల్ప నష్టం జరిగిందన్నారు. గాలిలో తేమ అధికంగా ఉండడం, 20డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత రాత్రివేళ నమోదు కావడంతో రాగి పంటలో అగ్గి తెగులు వ్యాప్తి చెందిందన్నారు. నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల కార్బెండిజం పొడి మందును కలిపి చల్లాలన్నారు. చిలగడు దుంపకు అక్కడక్కడ ఆకులపై రంధ్రాలు కనిపిస్తున్నాయని. రైతులు లీటరు నీటికి ఐదు నుంచి పది మిల్లీలీటర్ల వేప నూనె కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేశ్‌బాబు, జోగారావు, ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, సిబ్బంది సింహాచలం, సౌందర్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల వల్ల కలిగే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈవో ఎం. జాన్సన్ సూచించారు. బుధవారం ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బంది మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్‌స్టాండ్‌లో మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీహెచ్‌ఈవో మాట్లాడుతూ దోమల వల్ల ప్రధానంగా మలేరియా, చికున్ గునియా, డెం గ్యూ వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రజలు జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. గృహాలు, వీధుల్లో నిల్వ నీరు లేకుండా చేసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి కె. పోతురాజు, ఎంటీఎస్ ఎం. శ్రావణి పాల్గొన్నారు.

లబ్బూరు 'ఏకలవ్య'లో సౌకర్యాల లేమి

పాడేరురూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలం లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధా కృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లబ్బూరులో పాఠశాల భవన నిర్మాణం, ప్రహరీ పూర్తి కాకుండా విద్యార్థినులను తరలించారన్నారు. దీంతో విద్యార్థినులకు రక్షణ కొరవడిందన్నారు. ఈ స్థితిలో లబ్బూరుకు విద్యార్థినులను తరలించ వద్దని తల్లిదండులు అధికారుల వద్ద ప్రాధేయపడినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అక్కడి భవనం శ్లాబ్ పూర్తిగా కారిపోవడంతో నిలబడేందుకు కూడా అవకాశం లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే సదుపాయాలు కల్పించకుంటే తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో కర్రల వంతెన నిర్మాణం



చిన్నగంగవరం వద్ద కర్ర వంతెన నిర్మిస్తున్న గిరిజన యువత

సీలేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గూడెంకొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీ చిన్నగంగవరం వాగు వద్ద ఆదివాసీలు శ్రమదానంతో కర్రలతో వంతెన నిర్మించుకున్నారు. గత ఏడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు చిన్నగంగవరం గ్రామం వాగు వద్ద బ్రిడ్జి కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలిక రాకపోకలు సాగించేందుకు అధికారులు కాలువ వద్ద తూరాలు ఏర్పాటు చేశారు. ఇవి వారం రోజుల క్రితం వచ్చిన వర్షానికి కొట్టుకుపోయాయి. దీంతో చిన్నగంగవరం, పేట్రాయి, నరమామిడిగొంది గ్రామాల యువకులు శ్రమదానం చేసి కర్రలతో వంతెన నిర్మించుకున్నారు. నడిచి వెళ్లేందుకు, ద్విచక్రవాహనాలు ప్రయాణించేందుకు మలుచుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

చెట్టు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది, ఇంజనీర్లు

సీలేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ కేంద్రంలో 11కేవీ విద్యుత్ తీగలపై భారీ వృక్షం కులిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌కి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో కొన్ని వీధులకు రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం సిబ్బంది మరమ్మతులు చేపట్టి, సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఏడీ చంద్రశేఖర్ ప్రసాద్, జూనియర్ ఇంజనీర్ నాగేశ్వరరావు, లైన్‌మన్ రాంబాబు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందు పంపిణీ

పాడేరురూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నులిపురుగులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. ప్రతీ విద్యార్థీ ఏడాదికి ఒకసారి ఈ మాత్రలను విధిగా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.గౌరీ శంకరరావు, డాక్టర్.జానకీరామ్, ఐక్యూఏస్సీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, జువాలజీ విభాగ అధిపతి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీనగర్‌లో సెల్ టవర్ నిర్మించాలని వినతి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని ఆర్‌వీనగర్‌లో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవోకి వైసీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బుధవార నాయకులు జల్లి సుధాకర్, బొబ్బిలి లక్ష్మణరావు, అంజి పీవోని కలిసి సెల్ టవర్ లేక స్థానిక ప్రజలు, ఏపీఎఫ్‌డీసీ ఉద్యోగులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై పీవోని సానుకూలంగా స్పందించినట్టు వైసీపీ నాయకులు తెలిపారు.

తాగునీటి బావిలో పూడిక తొలగింపు



ఒంటిపాకలో బావిలో పూడికలు తొలగిస్తున్న గ్రామ యువకులు

హుకుంపేట ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగశీల పంచాయతీ ఒంటిపాక గ్రామంలో కలుషితమైన బావిలో మోటారు సాయంతో బుధవారం తొలగించి శు భ్రపరిచారు. పూడికలు తొలగించారు. గ్రామంలో 150 కుటుంబాలు.. 600పైగా జనాభా ఉంది. సుమారుగా 40 ఏళ్లుగా ఈ బావినుంచి నీటిని వినియోగించడంతో వ్యాధులు బారిన పడుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ స్థితిలో బావిలో నీటిని శు భ్రపరిచినట్టు చెప్పారు. గ్రామానికి మంజూరైన గ్రావిటీ పథకం పనులు పూర్తి చేసి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి. సుశీల, పెసా కమిటీ సభ్యులు పాంగి తమన్న, ఎస్. మత్స్యరాజు, గ్రామస్థులు భాగ్యరాజు, భాస్కరరావు ప్రేమ్ సూరిబాబు, దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యం

» మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి



సంఘీభావం తెలుపుతున్న మాజీ కేంద్ర మంతి కృపారాణి, నేతలు

చింతపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో సుపరిపాలన చేరువకావాలంటే ఏఐసీసీ కార్యదర్శి రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. బుధవారం చింతపల్లి పర్యటనకు వచ్చిన ఆమెను కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. హనుమాన్ జంక్షన్ నుంచి పాత బస్ స్టాంట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్ స్టాండ్‌లోనున్న రాహుల్‌గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేక్ కట్ చేశారు.అనంతరం మాజీ కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. దొంగ ఓట్లతో బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. బీహార్‌లో 65లక్షల ఓట్లు తొలగించారని, రాహుల్ గాంధీ కోరినట్టు డిజిటల్ ఓటర్ డేటా, సీసీ ఫుటేజ్ ఎన్నికల కమిషన్ ఇవ్వడంలేదన్నారు. దేశంలో అరాచకపాలనకు 2029లో జరిగే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అలాగే గిరిజన ప్రాంతలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తామన్నారు. పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని, వచ్చే ఎ న్నికల్లో ఆయనే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉంటారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అ త్యధిక స్థానాలు సొంతం చేసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతం లో 1/17చట్టం పటిష్టం, గిరిజన యువతకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోసం తమపార్టీ పనిచేస్తుందన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ వంతల బాబూరావు నాయకత్వంలో 150 మంది వైసీపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఒడిశా మాజీ కేంద్ర మంత్రి జైరామ్ పాంగి, ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ, కడప మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, విజయనగరం మాజీ జిల్లా అధ్య క్షుడు రమేశ్‌కుమార్, పీసీసీ డెలిగేట్ నోగెల చంద్రకళ, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి సమరెడ్డి బాలకృష్ణ, నాయకులు కిల్లో చిరంజీవి, మర్రి గురుమూర్తి, మొట్టడం బాలరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోండి

జిల్లా ఎస్పీ తుహీన్‌సిన్హా ▸▸ 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పట్టణంలో ట్రాఫిక్ సమస్య గురించి ఎస్పీ తుహీన్‌సిన్హాకు వివరిస్తున్న డీఎస్పీ

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహీన్‌సిన్హా ఆదేశించారు. బుధవారం పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. 'ట్రాఫిక్ పద్మవ్యూహం' అనే శీర్షికతో ఈ నెల 16న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు గోవిందరావు, రేవతమ్మతో కలిసి అబీద్ సెంటర్, శ్రీకన్య కూడలి, పెదబొడ్డేపల్లి కూడలిని పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మూడు కూడళ్లలోనూ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలకు తోడు అదనంగా మరికొన్ని అమర్చాలని, పోలీస్ స్టేషన్‌లోనే కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఎస్పీ సూచించారు.

40 టన్నులు మించితే ఓవర్ లోడ్

▸▸ నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు



టిప్పర్ యాజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వాహనం బరువుతో కలిపి 40 టన్నులు మించితే ఓవర్ లోడ్ కింద పరిగణిస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. తాళ్లపాలెం నుంచి తిరిగే ట్రాన్స్‌పోర్ట్ లారీ అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ 40 టన్నులు మించి బరువుతో తాళ్లపాలెం వంతెన మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తే వంతెన దెబ్బతింటుందన్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. వాహనం బరువుతో కలిపి 40 టన్నులు మించరాదని స్పష్టం చేశారు. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే డ్రైవర్లు, యజమానులపై చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. రవాణా సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

చీడిగుమ్మల పీఏసీఎస్ కమిటీ బాధ్యతలు



త్రీమెన్ కమిటీ ప్రతినిధులను సత్కరిస్తున్న రాజేశ్

గొలుగొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రీమెన్ కమిటీ ప్రతినిధులు బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా బీమిరెడ్డి సత్యనారాయణ, డైరెక్టర్లుగా ఫైల స్వామినాయుడు, నందిపల్లి వెంకటరమణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు మంజూరుకు కమిటీ కృషి చేయాలన్నారు. రైతులు పొందిన పంట రుణాలు సకాలంలో చెల్లించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు సాంబమూర్తి, డి.మధు, కొల్లి సత్యనారాయణ, ఎ.గోపి, కె.గోవింద్, సుర్ల బాబ్జి, కొల్లి రాంబాబు, కె.రవివర్మ, గెడ్డం ఆనంద్, పి.రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ ఉంచొద్దు: శాస్త్రవేత్తలు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

దేవరాపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెరకు, వరి పంట పొలాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని చిననందిపల్లి, కాశీపురం, పెదనందిపల్లి గ్రామాల్లో బుధవారం శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు, ఏవో ఎల్.వై.కాంతమ్మ తదితరులు పర్యటించారు. ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు చేశారు. వరి పంటలో ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌కలిపి చల్లుకోవాలని వారు సూచించారు.

రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళులు



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, నాయకులు విగ్రహానికి పూలవేల వేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నంగిన రమణ, సిద్ధ, బైపురెడ్డి శేషు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని ధర్నా

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలోని జి.కోడూరు గ్రామంలో మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. పెదబొడ్డేపల్లిలోని మైనింగ్ ఏడీ కార్యాలయం ఎదుట బుధవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు బొట్టా నాగరాజు మాట్లాడుతూ జి.కోడూరు మైనింగ్ లీజ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 29 రోజులుగా ధర్నా చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత ఈరెల్లి చిరంజీవి, దళిత రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛనుదారులకు తొలగింపు నోటీసులు

అప్పీళ్ల కోసం తరలివచ్చిన లబ్ధిదారులు

కిటకిలాడిన మండల పరిషత్ కార్యాలయం



అప్పీళ్ల కోసం వచ్చిన దివ్యాంగ లబ్ధిదారులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఉద్యోగులు

చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన నిర్ధారణ పరీక్షల అనంతరం తొలగించిన వారికి నోటీసులు జారీ చేస్తున్నది. నోటీసులు అందుకున్న లబ్ధిదారులంతా ఈ నెల 25వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో అప్పీలు చేసుకోవాలని చెప్పడంతో బుధవారం వారంతా మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. మండలంలోని 1459 వికలాంగ పింఛన్లు ఉండగా, వారిలో 331 మందిని అధికారులు తొలగింపు జాబితాలో చేర్చి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారు మండల కార్యాలయానికి చేరుకుని తమ అప్పీళ్లను అధికారులకు అందించారు. అప్పీళ్లు చేసుకునే దివ్యాంగులకు అప్పీళ్లు రాసేందుకు వీలుగా మండల పరిషత్ కార్యాలయంలో కొందరు సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో, వారు దరఖాస్తులను పూర్తి చేశారు. నోటీసులు అందుకున్న లబ్ధిదారులతో పాటు, వారికి సాయంగా తరలివచ్చిన వారితో మండల పరిషత్ కార్యాలయం కిటకిటలాడింది.

కౌమార దశలో వివాహాలు వద్దు

▸▸ అవగాహన సదస్సులు నిర్వహించండి ▸▸ పిల్లలకు హక్కులు, చట్టాలను వివరించండి ▸▸ అధికారుల సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్



బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కౌమార దశలో వివాహాలు జరగకుండా మండల, గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం మాసాంతపు జిల్లాస్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల, గ్రామ, వార్డుల పరిధిలో బాలల సంక్షేమ, రక్షణ కమిటీలను ఏర్పాటు చేసి బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా జరగకుండా, బాలలతో భిక్షాటన వంటివి చేయకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే బాలలు మత్తు మందులకు బానిస కాకుండా చూడడంతో పాటు వారిలో స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని కమిటీ సభ్యులకు కలెక్టర్ సూచించారు. పిల్లలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించి, బాల బాలికలతో వేర్వేరుగా సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆందోళన



నర్సీపట్నం ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏజెంట్లు

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎం.ఫైడియ్య, కార్యదర్శి వి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఏజెంట్ల వయో పరిమితి 65 నుంచి 85 సంవత్సరాలకు పెంచాలని, ఏజెంట్లకు ఇస్తున్న ఇన్సూరెన్స్ రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఏజెంట్‌కి మెడీక్లెయిమ్ సౌకర్యం కల్పించాలని కోరారు. బీమా నిధి, ఏజెంట్లకి పెన్షన్ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.లచ్చాపాత్రుడు, ఎన్.రమణబాబు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చోడవరం ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

చోడవరంలో...

చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలపై అంగీకరించిన డిమాండ్లు అమలు చేయాలని స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ఎదుట ఏజెంట్లు బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. గ్రూప్ ఇన్సూరెన్స్ వయో పరిమితిని, జీటీఐ కవరేజీ రూ.15 నుంచి రూ.25 లక్షలకు పెంచాలని, బీమా ఏజెంట్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బ్రాంచి ఏజెంట్ల సంఘం నాయకులు మోహన్, శంకరరావు, శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావు. సత్యం, నూకరాజులతో పాటు సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, ఎస్.వీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు దొండపూడిలో దుర్గాలమ్మ పండుగ

▸▸ రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల ఏర్పాటు



దుర్గాలమ్మ ప్రతిమ

రావికమతం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం దుర్గాలమ్మ పండుగ నిర్వహణకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు, ఉత్తరాంధ్ర జిల్లాల క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని వారు చెప్పారు. గ్రామస్థుల సహకారంతో అమ్మవారి నూతన దేవాలయం నిర్మించి, ఈ నెల 13న అంత్యంత వైభవంగా ప్రారంభోత్సవం చేసిన విషయం తెలిసిందే. అమ్మవారి తొలి పండుగను గురువారం నిర్వహించనున్న నేపథ్యంలో కబడ్డీ, వాలీబాల్, క్విజ్ పోటీలు ఏర్పాటు చేసి, విజేతలకు నగదు బహుమతులు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాల క్విజ్ పోటీ విజేతలకు కూడా భారీ నజరానా అందిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు మరిడిమాంబ పండుగ

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, సిహెచ్.నాగాపురం, పల్లావూరు గ్రామాల్లో గురువారం మరిడిమాంబ పండుగ కోసం ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఏఎల్ పురంలో విద్యుత్ అలంకరణతో పాటు ఆలయానికి, అమ్మవారి విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

ఎల్‌బీ పురం, బంగారుమెట్ట గ్రామాల్లో...

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురం, బంగారుమెట్ట గ్రామాల్లో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తీన్‌మార్, బాణసంచా పేలుళ్లు, నేలవేషాల నిర్వహణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వారు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించకోవాలని కోరారు.

మహిళా పరస్పర సహాయక సంఘ కార్యవర్గం

చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చోడవరం మహిళా పరస్పర సహాయక సంఘం అధ్యక్షురాలుగా సియ్యాద్రి అనూరాధ నియమితులయ్యారు. సంఘం కార్యదర్శిగా బాలిబోయిన రమణమ్మ, డైరెక్టర్లుగా తలారి సత్యవతి. రొంగలి సత్యవతి, పుచ్చకాయల వరహాలమ్మ. సిరికి అన్నపూర్ణ, మారాజు రమణమ్మ, గాడి రాములమ్మ, కె.లక్ష్మి, డి.డయానా, ఆర్.అరిలమ్మ, కె.మహాలక్ష్మి ఎన్నికయ్యారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చండి

దేవరాపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని ఎంపీడీవో సువర్ణరాజు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని, పారిశుధ్యం మెరుగుపర్చాలని సూచించారు. అలాగే రక్షిత నీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని, మురుగు కాలువలను పరిశుభ్రం చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైవాడ జలాశయం నీటి విడుదల



శారదానదిలోకి పారుతున్న వరద నీరు

దేవరాపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం ఏడో రెగ్యులేటింగ్ గేటు ద్వారా వరద నీరు బయటకు పంపే ప్రక్రియ కొనసాగుతున్నది. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, మంగళవారం సాయంత్రానికి 113.35 మీటర్లకు చేరింది. దీంతో జలాశయం నుంచి నీటిని బయటకు విడుదల చేశారు. బుధవారం పినకోట చల్లగెడ్డ, సమ్మెద గెడ్డల నుంచి జలాశయంలోకి 1500 క్యూసెక్కుల వరద నీరు చేరింది. దీంతో జలాశయం నీటిమట్టం 113.4 మీటర్లకు చేరడంతో 500 క్యూసెక్కుల నీటిని ఏడో నంబర్ గేటు నుంచి బయటకు పంపినట్టు డీఈఈ సత్యంనాయుడు తెలిపారు.

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించండి

రోలుగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త ఎ.సౌజన్య సూచించారు. మండలంలోని అడ్డసరంలో బుధవారం పొలాలను సందర్శించారు. అనంతరం ఆర్ఎస్‌కే కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణకు వాడాల్సిన పురుగు మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యూరియాను అవసరం మేరకు వాడాలని, ఎక్కువ మోతాదులో వినియోగించవద్దని సూచించారు. సమావేశంలో శాస్త్రవేత్త ఎన్.సత్తిబాబు, ఏవో చిరంజీవి పాల్గొన్నారు.

గంజాయి రవాణా నివారణకు డ్రోన్ కెమెరాతో నిఘా



ఏటిగైరంపేటలో డ్రోన్ కెమెరాతో నిఘా పెడుతున్న దృశ్యం

గొలుగొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి, అనకాపల్లి జిల్లాలను ఆనుకుని ఉన్న గ్రామాల్లో డ్రోన్ కెమెరాతో గంజాయి రవాణాపై గొలుగొండ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. మండలంలోని ఏటిగైరంపేట, ముంగర్లపాలెం. సీతకండి, రావణాపల్లి, అల్లూరి జిల్లా డౌనూరు, మర్రిపాలెం, చిట్టింపాడు అటవీ ప్రాంతాల్లో బుధవారం నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఐ మాట్లాడుతూ ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి కాలినడకన, గుర్రాలపై అటవీ ప్రాంతం మీదుగా గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం ఉందని, అందుకే డ్రోన్ కెమెరాతో నిరంతరం నిఘా పెట్టామని చెప్పారు. అలాగే తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్ఐ రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ నష్టాలపై వివరాలు సేకరించండి: ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

చీడికాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నష్టాలపై వివరాలు సేకరించాలని ఎంపీడీవో హేమసుందర్రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాఖల వారీగా నష్టం వివరాలు తయారు చేయాలని చెప్పారు. మలేరియా, వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఉపాధి అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ మండల శ్రీనివాసరావు, ఏపీవో అల్లు గంగునాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీలో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చారు. ప్రత్యేక కేటగిరి కోటాలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 25 నుంచి 28వ తేదీలోగా సర్టిఫికెట్లు తనిఖీ చేయించుకోవాలి. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. 29వ తేదీలోగా వెబ్ ఆప్షన్ మార్చుకోవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. 31న సీట్లు కేటాయింపు, సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కళాశాలలో కూడా విద్యార్థుల పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఏర్పాటు చేశామన్నారు. కాలేజీలో బీఎస్సీ మేజర్ సబ్జెక్ట్ కెమిస్ట్రీలో 40 సీట్లు, జువాలజీలో 40, కంప్యూటర్‌సైన్స్‌లో 40, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో 40, బీఏ ఎకనమిక్స్‌లో 60, బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో 60 సీట్లు ఉన్నాయని ఆయన చెప్పారు. మరింత సమాచారం కోసం కళాశాల సమన్వయకర్తలు డాక్టర్ నారాయణమూర్తి 8247470250, డాక్టర్ మల్లిబాబు 9966545448 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఐటీఐలలో మూడో విడత ప్రవేశాలు

నర్సీపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకొని, ప్రభుత్వ ఐటీఐలలో ఈ నెల 27 మధ్యాహ్నం 1 గంటలోగా సర్టిఫికెట్లు తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో చేరే విద్యార్థులు 29వ తేదీన, ప్రైవేటు ఐటీఐలో చేరాలనుకునే అభ్యర్థులు 30వ తేదీలోగా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో సహా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో 29వ తేదీన ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఐటీఐలో హాజరుకావాలని ఆయన సూచించారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

గొలుగొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట కూడలిలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వైపు విద్యార్థులతో వస్తున్న ప్రైవేటు స్కూల్ బస్సు జోగంపేట జంక్షన్ వద్ద స్టీరింగ్ ఊడిపోవడంతో ఎదురుగా ఉన్న పలు కూరగాయల దుకాణాలపైకి దూసుకుపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి తీసుకున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు పాతబడిన బసుల్లో విద్యార్థులను నర్సీపట్నం తరలిస్తున్నారని స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వచ్చారు. ఈ సమాచారం తెలియడంతో చాలా మంది దుకాణాలు మూసివేశారు. అందుబాటులో ఉన్న ఒకటి, రెండు దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

180 మందికి నేత్ర పరీక్షలు

చోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో 180 మందికి కంటి పరీక్షలు చేశారు. కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆపరేషన్ కోసం ఎంపిక చేసిన వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించేందుకు నిర్ణయించారు. ఆపరేషన్లకు వెళ్లే వృద్ధులకు అవసరమైన రవాణా, భోజన సదుపాయం కల్పిస్తామని బాయంకు మేనేజర్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డీజీఎం వి.రమేశ్, బ్యాంకు సీఈవో శ్యామ్ పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలకు తరలిరండి

కృష్ణాదేవిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23 నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలిరావాలని పార్టీ జిల్లా నాయకులు మేకా సత్యనారాయణ, జి.రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు పాతకృష్ణాదేవిపేటలో బుధవారం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మేకా భాస్కరరావు, నాగరాజు, సుబ్బారావు, ఫైడియ్య, రమణమ్మ, రాంబాబు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీలు

చోడవరం/నాతవరం/గొలుగొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణపై బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమల నివారణ దినం సందర్భంగా చోడవరం, నాతవరం, గొలుగొండ మండలాల వైద్యులు, సిబ్బంది ఈ కార్యక్రమం చేపట్టారు. చోడవరం కమ్యూనిటీ ఆసుపత్రి, కొత్తూరు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఆశ కార్యకర్తలు, విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎ.మల్లిఖార్జున్, సిబ్బంది రమణ, త్రిమూర్తులు, నాని పాల్గొన్నారు. అలాగే నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎంపీహెచ్‌వో రమణ, పీఎస్ఎన్ త్రివేణి, సిబ్బంది పాల్గొన్నారు. గొలుగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిలో రెండు, నాలుగు యూనిట్ల రిజర్వు షట్‌డౌన్

పరవాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని వెయ్యి మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు, నాలుగు యూనిట్లను అధికారులు రిజర్వు షట్‌డౌన్ చేశారు. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను మంగళవారం, 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌ను బుధవారం రాత్రి షట్‌డౌన్ చేశారు. విద్యుత్ సరఫరాకు డిమాండ్ లేకపోవడంతోనే రెండు యూనిట్లను షట్‌డౌన్ చేసినట్టు అధికారులు తెలిపారు. విద్యుత్ డిమాండ్‌నుబట్టి ఈ యూనిట్‌ల్లో సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. ప్రస్తుతం ఒకటి, మూడు యూనిట్‌ల్లో విద్యుదుత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.

జిల్లాలో 2,98,623 మందికి నులిపురుగుల మాత్రలు పంపిణీ

- డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల బాలబాలికలు 3,02, 756 మంది ఉండగా, ఈ నెల 12న నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో 2,98,623 మందికి నులి పురుగుల మాత్రలు వేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి తెలిపారు. బుధవారం జరిగిన మాప్ ఆఫ్ రౌండ్‌లో 3,052 మంది పిల్లలకు నులి పురుగుల మాత్రలు వేశామన్నారు.

టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అంకురార్పణ

- విజయవాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో గేమ్ ఛేంజర్: కలెక్టర్
- రాష్ట్రాభివృద్ధికి దోహదం: ఎమ్మెల్యే పల్లా
- మరింత పెరగనున్న విశాఖ బ్రాండ్ ఇమేజ్: ఎమ్మెల్యే గణబాబు





విశాఖలోని 'ది డెక్'లో టాటా ఇన్నోవేషన్ హబ్ విశాఖ కేంద్రాన్ని బుధవారం వర్చువల్‌గా సీఎం చంద్రబాబు విజయవాడలో ప్రారంభించగా, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా (ఇన్‌సెట్‌లో) చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఏర్పాటుచేసిన టాటా ఇన్నోవేషన్ హబ్‌లో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన నూతన భవనం 'ది డెక్'లో టాటా ఇన్నోవేషన్ హబ్ విశాఖ కేంద్రాన్ని బుధవారం విజయవాడ నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, తదితరులు పాల్గొనగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కేంద్రం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. యువతకు కొత్తగా ఏన్నో చేయాలని ఉత్సాహం ఉంటుందని, వాటిని ఆచరణలోకి తీసుకురావడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. వారికి అవసరమైన ప్రోత్సాహం ఈ కేంద్రం అందిస్తుందన్నారు. దీనిని అన్నివిధాలుగా ముందుకు తీసుకువెళ్లడానికి నిర్వహణలో విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, అధికారులను భాగస్వాములుగా చేశామన్నారు. నాలెడ్జ్ భాగస్వాములుగా గీతం యూనివర్సిటీ, ఐఐపీఈ, పారిశ్రామిక భాగస్వాములుగా జీఎంఆర్, దివీస్, ఆర్సెలర్ మిట్టల్ ఉంటాయన్నారు. ఈ కేంద్రం సీఈఓగా రవి ఈశ్వరపు, కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారన్నారు. సచివాలయాలకు చెందిన 20 మందిని సిబ్బందిగా సమకూర్చామన్నారు. ఐటీ సంస్థలు, ఫ్యాక్టరీస్ విభాగాల నుంచి కూడా అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఈ హబ్ కొత్త దిశను చూపిస్తుందన్నారు. గ్లోబల్ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. విప్, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, ఈ హబ్‌తో విశాఖ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ యువతకు ఈ కేంద్రం బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా బై వైజాగ్, డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, టీహబ్ ఐటీ హైదరాబాద్, ఆల్కేవ్ పార్టనర్స్, ఐటాప్, అట్లాస్ కాన్సిలియో, లయా గ్రీన్ వెంచర్స్, సీఐఐ యంగ్ ఇండియన్స్‌తో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లు ప్రసంగించగా, జీఎంఆర్ ప్రతినిధి టాటా తేజ, దివీస్ ల్యాబ్స్ నుంచి డాక్టర్ సురేశ్, ఆర్సెలర్ మిట్టల్ నుంచి ఎం.రవీంద్రనాథ్, ఏయూ నుంచి రిజిస్ట్రార్ ధనుంజయరావు, గీతం నుంచి డాక్టర్ రాజా పప్పు, ఐఐపీఈ నుంచి డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

శరవేగంగా 126 అడుగుల లక్ష్మీ గణపతి విగ్రహ నిర్మాణం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 126 అడుగుల లక్ష్మీ గణపతి విగ్రహం ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. వినాయక చవితి సందర్భంగా సుమారు నెల రోజులుగా 25 మంది కార్మికులు వినాయకుడి విగ్రహం తయారీలో నిమగ్నమై ఉన్నారు. ప్రముఖ శిల్పి కామధేను ప్రసాద్ ఈ విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నెల 25వ తేదీ నాటికి విగ్రహం తయారీతో పాటు మండపం నిర్మాణం కూడా పూర్తయ్యే అవకాశముందని నిర్వాహకులు తెలిపారు. సుమారు తొంభై టన్నుల సర్వే కర్రతో మండపం నిర్మాణం జరుగుతున్నది. నాలుగు టన్నుల మట్టిని వినాయకుని విగ్రహం తయారీకి వినియోగిస్తున్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 23 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. వినాయక చవితి సందర్భంగా రోజుకొక సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహం తయారీకి సుమారు 70 లక్షల రూపాయలు వ్యయం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో తయారవుతున్న గణనాథుడు



22 నుంచి శాప్ జోనల్ క్రీడా పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ నేతృత్వంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి చాంపియన్‌షిప్ పేరుతో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనుందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అండర్-22 విభాగంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ పోటీలు, అండర్-19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల జట్ల నుంచి పురుషులు, మహిళల విభాగాలకు సుమారు 1800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో బాక్సింగ్, చంద్రంపాలెం స్కూల్‌లో బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని, మిగిలిన క్రీడాంశాల పోటీలు కొమ్మాదిలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులో జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణాలలో తాగునీరు, పారిశుధ్యం, సంచార మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మధురవాడ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వైద్య సదుపాయం నిమిత్తం అంబులెన్స్, మందులు, వైద్యులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. జోనల్ స్థాయిలో గెలుపొందినవారు ఈ నెల 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న తుది పోటీల్లో పాల్గొంటారని, వారికి బస్సు రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జోనల్ కమిషనర్ కనకదుర్గ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో వైసీపీకి ఎదురుదెబ్బ

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. అయితే పార్టీ పెద్దలు తమకు న్యాయం చేయకపోగా అవమానించే రీతిలో వ్యవహరిస్తూ వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో కూడా మెజారిటీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా బీ ఫారం జారీ చేశారని ఆరోపించారు. తన భర్త బొలిశెట్టి గోవిందరావు ఇప్పటికే వైసీపీ నుంచి బయటకు వచ్చేశారని, ఎంపీపీ ఎన్నిక విషయంలో పార్టీ పెద్దలు వ్యవహరించిన తీరుకు నిరసనగా తనతోపాటు ఎంపీపీ వెంకటలక్ష్మి, ఎస్.రాయవరం-1 ఎంపీటీసీ సభ్యుడు బైపా శ్రీనివాసరావు, గెడ్డపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బాలం భవాని, వమ్మవరం ఎంపీటీసీ సభ్యుడు బాలం సూరిబాబు, లింగరాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు రావి లక్ష్మి, ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, చినగుమ్ములూరు సర్పంచ్ గాడి బుజ్జి, కర్రివానిపాలెం సర్పంచ్ కర్రి హేమలత వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ, వైసీపీ పెద్దలు తనను రాజకీయంగా దెబ్బతీయాలని చూసినప్పటికీ హోం మంత్రి వంగలపూడి అనిత తనకు అండగా నిలిచారని, టీడీపీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీ సభ్యుల మద్దతుతో ఇండిపెండెంట్‌ను ఎంపీపీగా పోటీ చేయించి గెలిపించుకున్నామని చెప్పారు.

త్వరలో టీడీపీలో చేరిక?

కాగా వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, ఆయన మద్దతుదారులు త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్టు తెలిసింది. వీరిలో జడ్పీటీసీ సభ్యురాలు, ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు, ఐదుగురు సర్పంచులు వున్నట్టు సమాచారం

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

... 5వ పేజీ తరువాయి

మండలం నల్లగొండకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోతల లోవబాబు వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణాదేవిపేట ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు చెప్పారు. లచ్చబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇతనికి భార్య, ఎనిమిదేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు వున్నారు.

25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలి
- రెవెన్యూ శాఖ సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, సర్వీసులు నిర్ణీత గడువులోగా అందించాలని, ఈ నెల 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో పీజీఆర్ఎస్ అర్జీలు, అందరికీ ఇల్లు, భూముల క్రమబద్ధీకరణ, భూసర్వే, కోర్టు కేసులు, అన్నదాత సుఖీభవ, రేషన్ పంపిణీ, మ్యుటేషన్లు, ఏపీ సేవా సర్వీసులు, నీటి తీరువా వసూళ్లు, ఇంటి స్థల దరఖాస్తుల పరిశీలన, తదితర అంశాలపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని, అర్జీలు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యల ఎండార్స్‌మెంటు కాపీని అర్జీదారునికి అందించాలని తెలిపారు. ఇంటి స్థలం కోసం వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి పెండింగ్ కాకుండా చూడాలన్నారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను ఈవారంలోగా పరిశీలించాలని ఆదేశించారు. రేషన్‌షాపుల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారి కేఎల్ఎన్ మూర్తి, కలెక్టరేట్ పరిపాలన, భూ పరిపాలన, సమన్వయ విభాగాల పర్యవేక్షకులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, మండల సర్వేయర్లు హాజరయ్యారు.

గంజాయి గుప్పు.. ఎవరిది తప్పు?

... 5వ పేజీ తరువాయి

ఆధారపడడంతో తప్పులు జరుగుతున్నాయని పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గతంలో గంజాయి స్మగ్లర్లకు సహకరిస్తున్న వ్యవహారాల్లో మారేడుమిల్లి సీఐ, మోతుగూడెం ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు. వాస్తవానికి అప్పట్లోనూ తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు వారిపై చర్యలు చేపట్టారు. మోతుగూడెం ప్రాంతం నుంచి రవాణా అవుతున్న గంజాయి నెల్లూరు జిల్లాలో పట్టుబడింది. ఈ క్రమంలో మోతుగూడెం పోలీసులు స్మగ్లర్ల వద్ద డబ్బులు తీసుకుని గంజాయి రవాణాకు సహకరించినట్టు నెల్లూరు పోలీసులకు పక్కా ఆధారాలు లభించడంతోనే వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు. అది ఏలూరు రేంజ్ పరిధిలో ఉండడంతో పోలీసు అధికారులపై తక్షణ చర్యలు చేపట్టారు. అదే విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఇటువంటి ఘటనలు జరిగితే పట్టించుకోరనే విమర్శలు అప్పట్లో వినిపించాయి. జిల్లాలోని అధికారులు సైతం అలానే వ్యవహరిస్తున్నారు. గంజాయి వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో పోలీసులు, ఇతరుల పాత్రపై అధికారులు కనీసం దృష్టి సారించడం లేదని తెలుస్తున్నది. వాస్తవానికి మావోయిస్టుల కదలికలను సైతం ఇట్టే కనిపెడుతున్న పోలీసులకు గంజాయి సాగు, రవాణా, స్మగ్లర్లు, వారికి సహకరిస్తున్న వారిని కట్టడి చేయడం పెద్ద విషయం కాదు. కానీ అందుకు చిత్తశుద్ధి, అంకితభావం ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్లే గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒడిశా నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా జరుగుతున్న క్రమంలో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్ గేట్లు ఎలా దాటిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిత్యం తనిఖీల పేరిట పోలీసులు హడావుడి చేస్తుంటారు. సామాన్యులు, కుటుంబాలతో రాకపోకలు సాగిస్తున్న వారిని కూడా తనిఖీ చేస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాను దాటి గంజాయి ఇతర జిల్లాలకు ఎలా తరలుతుందనేది జవాబు దొరకని ప్రశ్నగా మారింది. వాస్తవానికి జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో, అనంతగిరి ఘాట్‌లోని బొడ్డవర వద్ద, చింతపల్లి ఘాట్‌లో డౌనూరు, పాడేరు ఘాట్ కింద తాటిపర్తి వద్ద కేవలం గంజాయి తనిఖీల కోసమే ప్రత్యేకంగా చెక్‌గేట్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాహనాల్లో వందల కిలోల గంజాయి అల్లూరి జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు రవాణా జరుగుతుందంటే? పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు మంగళవారం నక్కపల్లి మండలం నెల్లిపూడి వద్ద 200 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీనిని ఒడిశాలో కొనుగోలు చేసి చింతపల్లి మండలం లంబసింగి తీసుకువచ్చి అక్కడ నుంచి ఆటోలో నర్సీపట్నం, అక్కడి నుంచి కారులో నక్కపల్లి మండలం నెల్లిపూడికి తరలించి నిల్వ చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని పోలీసుల సహకారం లేకుండా స్మగ్లర్లు గంజాయిని ఒడిశా నుంచి అల్లూరి జిల్లా మీదుగా అనకాపల్లి జిల్లాలోకి ఎలా తరలించగలరనేది తాజాగా ఉత్పన్నమవుతున్న ప్రశ్న.

క్రైం... crime news

శారదా నదిలో రైతు గల్లంతు



శారదా నదిలో గల్లంతైన నారాయణరావు (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శారదా నదిని ఈదుకుంటూ దాటుతున్న ఓ రైతు.. వరద ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యారు. బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదు. ఇందుకు సంబంధించి రైతు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని వైలోవ గ్రామానికి చెందిన రైతు బద్ది నారాయణరావు (61) బుధవారం ఉదయం శారదా నదికి అవతల ఉన్న తన పొలంలో వరి విత్తనాలు చల్లడానికి ఈదుకొంటూ వెళ్లాడు. పనిపూర్తయిన తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో నదిలో ఈదుకుంటూ ఇంటికి బయలుదేరాడు. ఈ సమయంలో నదిలో వరద ప్రవాహం ఉధృతంగా వుండడంతో నారాయణరావు నీటిలో కొట్టుకుపోతూ గట్టిగా కేకలు వేశాడు. సమీపంలో ఉన్న కొంతమంది రైతులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నది వద్దకు చేరుకున్నారు. తరువాత రాంబిల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నరసింగరావుకు, తహశీల్దారు శ్రీనివాసరావు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. తహశీల్దారు సమాచారం మేరకు కొంతసేపటి తరువాత ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వచ్చింది. అప్పటికే నది వద్దకు వచ్చిన ఎలమంచిలి ఫైర్‌స్టేషన్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం కలిసి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు రైతు ఆచూకీ లభించలేదు.

మద్యం మత్తులో కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

కె.కోటపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి.. కత్తితో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ ధనుంజయ్ తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని కింతాడ శివారు గంగాభవానిపాలెం గ్రామానికి చెందిన లాలం నూకరాజు అక్కడే వున్న ఒక రైస్ మిల్లు, కోళ్ల ఫారంలో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం రైస్ మిల్లు నుంచి బయటకు వస్తుండగా కింతాడ గ్రామానికి చెందిన సిరపరపు శివస్వామి నాయుడు కత్తి పట్టుకుని అడ్డుకున్నాడు. మద్యం తాగడానికి డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బులు లేవని నూకరాజు చెప్పగా, శివస్వామినాయుడు కత్తితో దాడి చేసి మెడపై గాయపరిచాడు. అడ్డుకోబోయిన నూకరాజు అత్త దేవుడమ్మపైనా దాడి చేశాడు. దీంతో స్థానికులు స్పందించి శివస్వామినాయుడును పక్కకు నెట్టివేసి, గాయపడిన నూకరాజును ఆస్పత్రికి తరలించారు. ఇతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శివస్వామినాయుడుని అదుపులోకి తీసుకుని, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- నాలుగున్నర తులాల బంగారం స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చోడవరం మండలం తిమ్మనపాలెం గ్రామంలోని ఐదు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని చోడవరం పోలీసులు అరెస్టు చేసి నాలుగున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చోడవరం మండలం తిమ్మనపాలెం గ్రామంలో ఈ నెల ఏడు నుంచి 18వ తేదీ వరకు వరుసగా చోరీలు జరిగాయన్నారు. ఊరిలో ఉన్న రైతులు పొలం పనులకు వెళ్లే సమయంలో అదే గ్రామం పాయకారి కాలనీకి చెందిన కన్నూరి విష్ణుమూర్తి ఈ చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. ఇతను పరవాడలోని ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడన్నారు. చెడు అలవాట్లకు లోనై వచ్చిన జీతం చాలక దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. వ్యసనాలకు డబ్బులు అవసరమై సొంతూరిలో ఉన్న ఐదు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో చోడవరం సీఐ అప్పలరాజు తన సిబ్బందితో నిందితుడిని మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి చోరీకి గురైన నాలుగున్నర తులాల బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ చోరీ కేసుల్లో రూ. 30 వేలు వరకు నిందితుడు చోరీ చేసి జల్సాలకు ఖర్చు చేసినట్టు తెలిసింది. నిందితుడిని బుధవారం కోర్టుకు తరలించామని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ అప్పలరాజుతో పాటు ఎస్ఐలు నాగ కార్తీక్, జోగారావు, సిబ్బంది ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

- రూ.5 వేలు జరిమానా

కశింకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం చోరీ చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బి.వి.విజయలక్ష్మి బుధవారం తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామం రంగయ్య సెంటర్ ప్రాంతానికి చెందిన కావిడి నాని సింగం అలియాస్ లాజర్ 2024 డిసెంబరు 27న కశింకోట గ్రామ శివారున ఉన్న శ్రీనివాస పెట్రోలు బంకు సమీపంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశాడు. బాధితుడు భాను ప్రకాశ్ ఫిర్యాదు మేరకు సీఐ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి జైలు, జరిమానా విధించారు.

తప్పించుకు తిరుగుతున్న నిందితుడి అరెస్టు

ఎలమంచిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021వ సంవత్సరంలో నమోదైన గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడు అంబర్ ఖాన్‌ను పోలీసులు మధ్యప్రదేశ్‌లో అరెస్టు చేశారు. అతనిని బుధవారం విశాఖ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. నిందితుడు మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్ జిల్లా జమ్నేర్‌కు చెందిన వాడని, తమ సిబ్బంది అక్కడికి వెళ్లి నిందితుడిని అరెస్టు చేశారని ఎస్ఐ చెప్పారు.

ప్రహసనంగా పింఛన్ల ఏరివేత

... 5వ పేజీ తరువాయి

వైకల్య సర్టిఫికెట్లు పొందిన వారి పేర్లు తొలగింపు జాబితాలో లేకపోవడంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పి బోగస్ సర్టిఫికెట్లు ఇప్పించిన వ్యక్తులే ఇప్పుడు మళ్లీ డబ్బులు వసూలు చేసి అనర్హులైన పింఛన్‌దారుల పేర్లు తొలగింపు జాబితాలో లేకుండా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోగస్ దివ్యాంగులకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన వడపోత కార్యక్రమం ప్రహసనంగా మారగా, మరోవైపు నోటీసులు అందుకున్న వికలాంగులు లబోదిబోమంటూ అధికారుల వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

'స్త్రీ శక్తి'కి ఆదరణ

... 5వ పేజీ తరువాయి

భారం పడనుంది. 16న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు రూ.8,31,280, 17వ తేదీన రూ.11,94,230, 18వ తేదీన రూ.13,45,715, 19వ తేదీన రూ.12,71,255 విలువైన జీరో ఫేర్ టికెట్లు జారీ చేసినట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున జీరో ఫేర్ టికెట్ల జారీ విలువ పెరగనుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో రోజుకు సగటున రూ.15 లక్షల జీరో ఫేర్ టికెట్ల ద్వారా ప్రభుత్వంపై భారం పడనుందని, ఈలెక్కన చూస్తే నెలకు రూ.4.5 కోట్లు చొప్పున ఏడాదికి రూ.54 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524